తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి వచ్చేసింది. ఈ ఏడాది పుణ్య ఘడియలు మంగళవారం తొలి వేకువ నుంచి సాయంత్రం వరకు ఉండటంతో ప్రజలు మరింత ఆనందంగా నిర్వహించుకునేందుకు వీలు కలగనుంది. సోమవారం భోగి పండగ సందర్భంగా ఊరూవాడా తొలివేకువనే భోగిమంటలతో సందడి నెలకొంది. ఎక్కడెక్కడి నుంచే వచ్చిన బంధువులు, ఉపాధి కోసం ఊరొదిలి వెళ్లిన వారి రాకతో నియోజకవర్గంలోని గ్రామాలు కళకళలాడుతున్నాయి.

భోగభాగ్యాల భోగి

- ఊరూవాడా భోగి సందడి
- సంబరాల సంక్రాంతి నేడు
- కిటకిటలాడిన మార్కెట్లు
- కనుమ, ముక్కనుమ ఏర్పాట్లలో ప్రజలు


వేంకటాద్రిపై భోగి మంటలు


పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు


ఎస్ఆర్ పురం, సరిపల్లిలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి:

అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడే సంక్రాంతి పండగ రాకతో ఊరూవాడా సందడి నెలకొంది. గ్రామాల్లో సోమవారం ఉదయం భోగి మంటలతో సంబరాలకు అంకురార్పణ జరిగింది. వేకువజామున చిన్నాపెద్దా కలిసి పాత వస్తువులు, దుంగలు, భోగి పిడకలు భోగి మంటల్లో వేసి, భోగభాగ్యాలు సమకూర్చాలని వేడుకున్నారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ, చినముషిడివాడ, సుజాతనగర్, పురుషోత్తపురంతో పాటు గ్రామీణ ప్రాంతంలో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. మట్టి కుండల్లో వంటకాలు నోరూరించాయి. పిల్లాపాపలతో, కొత్త అల్లుళ్ల సందడితో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. డూడూ బసవన్నల ఆశీర్వచనాలు, కొమ్ముదాసరి అల్లరి చేష్టలతో ఉత్సాహం ఉరకలేసింది. పలుచోట్ల జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని, బహుమతులు కొల్లగొట్టారు. గ్రామాల్లో పండగ సంతలు కళకళలాడాయి. పెద్దల పండగ కలగూర కోసం దినుసులు సిద్ధం చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలు నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు.

రైతుల ఇంట సిరులు కురవాలి: ఎమ్మెల్యే రమేష్‌బాబు

మండలంలోని ఎస్ఆర్ పురం, సరిపల్లిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. రైతులకు మంచి దిగుబడులు వచ్చి వారింట సిరులు కురవాలని అభిలషించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


పూజా సామగ్రి, చెరకు గడలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


సంక్రాంతి కలగూర సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన జనంతో కిటకిటలాడుతున్న పెందుర్తి రైతు బజార్

క్లుప్తంగా

సింహగిరిపై విశేషంగా ధారోత్సవాలు


గంగధార నుంచి మొదలైన తిరువీధి

సింహాచలం: సింహగిరిపై నాల్గవరోజు సోమవారం ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకీలో, మరో పల్లకీలో సువర్ణ, చతుర్భుజ తాయారు, గోదాదేవి అమ్మవార్లను తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠింపజేసి పంచామృతాభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం గంగధార వద్దనే ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను కొలువుదీర్చి, విశేష పూజలు జరిపారు. చివరి పాశురాలను విన్నవించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంబరంగా భోగి పళ్ల ఉత్సవం


చిన్నారికి భోగి పళ్లు పోస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు దంపతులు

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం చిన్నారులకు భోగి పళ్లు పోసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నృసింహ మండపంలో పలువురు చిన్నారులకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు దంపతులు భోగి పళ్లు పోశారు. అర్చకులు చిన్నారులను ఆశీర్వదించారు. ఉదయం 9 గంటల నుంచి జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకొచ్చి, భోగిపళ్లు పోయించారు.

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందిస్తున్న ప్లాట్ల యజమానులు

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని జనచైతన్య సంస్థకు చెందిన సాయి వాహిని లేఅవుట్‌లో తమ పేరిట ఉన్న ప్లాట్లను తమకు అప్పగించేలా చూడాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును యజమానులు కోరారు. జనచైతన్య సంస్థకు, స్థానిక రైతులకు ఉన్న వివాదం కారణంగా 2003 నుంచి తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సోమవారం పెందుర్తిలో ఎమ్మెల్యేను కలిసిన 220 మంది ప్లాట్ల యజమానులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ వివాదానికి కారణం జనచైతన్య సంస్థ వ్యవహారశైలేనని ఆరోపించారు. అప్పట్లో ప్రభుత్వ భూమిని కలిపి లేఅవుట్ వేసి.. తమకు రిజిస్ట్రేషన్లు చేశారని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు.

సందడిగా ముగ్గుల పోటీలు

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మిక్సీ, ఫ్యాన్, కుక్కర్ బహుమతులుగా అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులుగా కుర్చీలను అందజేశారు. ఎంపీటీసీ కర్రి అప్పారావు, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, ఉప సర్పంచ్ కరణం సురేష్‌బాబు, కరణం సూరిబాబు, కరణం రమణ, కర్రి నాయుడు, ఎం.కన్నయ్య, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు బూరెల ప్రసాదం

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు సింహగిరిపై బూరెలను దేవస్థానం ప్రసాదంగా అందించింది. దర్శనానంతరం దక్షిణ రాజగోపురం వైపునుంచి వెలుపలికి వచ్చే భక్తులకు అన్నప్రసాద విభాగం సిబ్బంది హరి తదితరులు బూరెలు అందజేశారు.

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం

- వెంకన్న ఆలయంలో ఘనంగా గోదా కల్యాణం
- పరవశించిన భక్తజనం

పెందుర్తి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి ప్రాంతంలోని పలు దేవాలయాల్లో సోమవారం గోదాదేవి, రంగనాథుని కల్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. స్థానిక వేంకటాద్రిపై ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, చక్రస్నానం జరిపి ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అశేష భక్తజనం నడుమ అమ్మవారి కల్యాణం వేదమంత్రోక్తంగా పండితులు నిర్వహించారు. భక్తులకు శ్రీవారి సేవకులు 18 రకాల ప్రసాదాలను పంచిపెట్టారు.

- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు.
- పెందుర్తి పాత ఊరులో గోదాదేవి కల్యాణం జరిపారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారికి సారె సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధనలో భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.
- లక్ష్మీపురం పోర్టు కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణం కమనీయంగా జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఈ ఉత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని రంగనాథుడిగా అలంకరించారు. గోదాదేవిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు. శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు పుష్పాలంకరణ చేశారు. వేదమంత్రాలు, మేళతాళాల నడుమ ఆలయం నుంచి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్ల, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా జరిపారు. అడవివరం గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని, అక్షింతలను అందించారు. అర్చకులు భార్గవ్, శ్రీకాంత్, విజయ్ మారుతి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



వేంకటాద్రిపై గోదారంగనాయకుల కల్యాణం, పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తజనం

అప్పన్నకు తొలి పంట సమర్పణ

- రైతులు, భక్తులతో కిక్కిరిసిన సింహగిరి

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తొలిపంటను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పుదినుసులను భక్తిశ్రద్ధలో అందించారు. కరవు కాటకాలు రాకుండా ఏటా తమ వ్యవసాయ క్షేత్రాలు ఫలాలనందించాలని స్వామిని వేడుకున్నారు. పలువురు గ్రామీణ ప్రాంతాల భక్తులు గరిడీ బృందాలతో తరలివచ్చి స్వామికి మొక్కుచెల్లించారు. ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఎటు చూసినా సింహగిరి భక్తజన సంద్రంగా మారింది. దర్శన క్యూలు, ప్రసాద విక్రయాల భక్తులతో కిక్కిరిశాయి. సింహగిరిపైన, సింహగిరి ఘాట్‌రోడ్డులోను ట్రాఫిక్ రద్దీ నెలకొంది.


తలపై గుమ్మడికాయలు పెట్టుకుని స్వామికి సమర్పించేందుకు వస్తున్న మహిళలు


స్వామి దర్శనానికి క్యూల్లో బారులు తీరిన భక్తులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

పరవాడ: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండలసీపీఎం నాయకుడు అనకాపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పాతగొర్లివానిపాలెంలో విద్యుత్ చార్జీలకు నిరసనగా విద్యుత్ బిల్లుల్ని భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి, ఇపుడు అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లోనే భారీగా విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు.

ఎప్పుడో వాడిన విద్యుత్ బిల్లులకు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరిట ఏకంగా రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. ఈ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎ.నాని, బాబూరావు, ఎస్.అబ్బులు, టి.అప్పారావు, డి.దేముడు, కె.శెట్టిబేబీ తదితరులు పాల్గొన్నారు.


భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

సింహగిరి ఏర్పాట్లపై సీపీ పరిశీలన

సింహాచలం: సింహగిరిపై సంక్రాంతి సంబరాలను సోమవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తిలకించారు. భోగి సంబరాల నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఏర్పాట్లపై సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. క్యూలైన్లను పరిశీలించి దేవస్థానం అధికారులతో చర్చించారు. రాజగోపురం వద్ద వేదికపై శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన చిన్నారుల గోదాదేవి అలంకరణ, నృత్యపోటీలను సీపీ తిలకించారు. విజేతలకు బహుమతులు అందించారు. అన్నమాచార్య సేవా ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టీ సునీత, కోఆర్డినేటర్ మానేపల్లి లక్ష్మి, కల్యాణ వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతలో ఐకమత్యం, మానసిక ఉల్లాసం


టాస్ వేస్తున్న సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి. చిత్రంలో చొక్కాకుల వెంకటరావు, తదితరులు

సబ్బవరం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు యువతలో క్రీడా స్ఫూర్తితో పాటు ఐకమత్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అన్నారు. మండలంలోని రావలమ్మపాలెంలో సంక్రాంతి విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యింది. చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి టాస్ వేయగా, వెంకరావు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఏడాది పొడవునా వృత్తి, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న యువత పండగ రోజుల్లో స్వగ్రామాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొనగా, విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతపాటు, ట్రోఫీలను అందించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో కనుమ రోజున బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, రెడ్డి వాసుదేవరావు, గొంప రమణ, ఎస్.దేముడు, ఎస్.నరసింహమూర్తి, సీహెచ్ నాయుడు, జగన్నాథం, దొర, గొర్లి అప్పారావు, కేసరి తదితరులు పాల్గొన్నారు.

పండగల వేళ చోరీలపై అప్రమత్తం

- ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ
- పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు


అవగాహన కలిగిస్తున్న పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: సంక్రాంతి పండగ వేళ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు సూచించారు. సోమవారం పెందుర్తి కూడలి, వేంకటాద్రి సమీపంలో నేరాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరం అన్నారు. ఈ మేరకు ఆయన పలు సూచనలు చేశారు.

- పండగకు సొంత ఊళ్లకు వెళ్లేవారు తమ బంగారం, ఇతర విలువైన వస్తువులను బంధువుల ఇళ్ల వద్ద గానీ, బ్యాంక్‌లలో గానీ భద్రపరుచుకోవాలి.
- ప్రజలు ఇళ్లు వదిలి ఊళ్లకు వెళ్లేటపుడు తమ ఇంటి చిరునామాను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో అందించాలి.
- పోలీసులు తాళాలు వేసిన ఇళ్ల కోసం రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ద్వారా పోలీసులకు విషయం తెలియజేయాలి.
- షాపింగ్ మాళ్లు, థియేటర్లు, ఇతర రద్దీ ఉన్న ప్రదేశాల్లో మహిళలు చైన్ స్నాచర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి.
- వాహనాలను పార్కింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా హ్యాండిల్/హ్యాండ్ లాక్ వేసుకోవాలి.
- అపరిచిత వ్యక్తుల సమాచారం ఉంటే 1090, 100, 94409 04717(క్రైం సీఐ), 83310 41618(క్రైం ఎస్ఐ), పీఎస్: 0891-2764233 నంబర్లలో సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు.

రాళ్లు తేలిన రహదారిపై రాకపోకలకు ఇబ్బంది


రాళ్లు తేలిన ఎన్టీపీసీ-బొట్టవానిపాలెం రోడ్డు

పరవాడ:

ఎన్టీపీసీ-బొట్టవానిపాలెం రహదారి కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో రావాడ శివారు గ్రామాల ప్రజలు, కార్మికులు అవస్థలు పడుతున్నారు. రావాడ, ధర్మారాయుడుపేట, బొట్టవానిపాలెం గ్రామాల ప్రజల సౌకర్యార్థం 20 ఏళ్ల క్రితం ఎన్టీపీసీ నుంచి రావాడ మీదుగా బొట్టవానిపాలెం వరకు గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా దీని అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో రాళ్లు తేలిపోయి ప్రజల రాకపోకలకు పనికిరాకుండా మారిపోయింది. ఎన్టీపీసీ, కూలిపనులకు వెళ్లే కార్మికులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ గ్రామాలకు వేసిన రహదారి మాత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదని ఆయా గ్రామాల ప్రజలు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.